నిధులు కేటాయించాలని సీఎంకు వినతి

సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

కోహీర్, జూలై 11: జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పలు అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం టీజీఐఐసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నిర్మలాజగ్గారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కండెం నర్సింహులు, హనుమంత రావుపాటిల్, రామలింగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హర్షద్, మక్సూద్, ఉదయ్‌పాటిల్, తదితరులు ఉన్నారు.

నేడు హెల్మెట్ల పంపిణీ

కోహీర్, జూలై 11: జహీరాబాద్ పట్టణంలోని బీదర్ టీ జంక్షన్ ఆవరణలో శుక్రవారం ఉదయం 11.30గంటలకు హెల్మెట్ల పంపిణీ ఉంటుందని మహీంద్రా అండ్ మహీంద్రా పరిశ్రమ ప్రతినిధి విశ్వనాథ్ తెలిపారు. రహదారి భద్రత ప్రచారం పేరుతో నిర్వహించే హెల్మెట్ల పంపిణీ కార్యక్రమానికి ఎస్పీ రూపేశ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని వాహనదారులు విజయవంతం చేయాలని కోరారు.

యూనిఫాం రెడీ చేయాలి

కోహీర్, జూలై 11: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండో విడత అందించేందుకు దుస్తులను సిద్ధం చేయాలని ఐకేపీ ఏపీఎం సమ్మయ్య కోరారు. గురువారం కోహీర్ పట్టణంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఐకేపీ సీసీలు, వీవోఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో దుస్తులు కుట్టి పంపిణీకి ఏర్పాట్లు చేయాలని సూచించారు. డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల ద్వారా అందించిన రుణాలను తిరిగి వసూలు చేయాలని కోరారు. సమావేశంలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

కందిలో చోరీ

కంది, జూలై 11: మండల కేంద్రమైన కందిలో ఓ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లారు. కందికి చెందిన జంగం రాములు ఇంట్లో చొరబడ్డ దొంగలు బీరువాలో ఉన్న నగదుతోపాటు వెండి, ఆర తులం బంగారం ఎత్తుకెళ్లినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఉదయం సమాచారం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. రెండు రోజులుగా రాములు కుటుంబ సభ్యులు వైద్యం కోసం సంగారెడ్డిలో ఉంటున్నారు. ఉదయం ఇంటికి వచ్చిన వారికి తాళం లేకపోవడం, బీరువాలోని బట్టలు, సామాన్లన్నీ చిందరవందరగా పడే సి ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం ఇదే వీధిలో మరో ఇంట్లో చోరీ జరిగింది. నెల వ్యవధిలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ..

అందోల్, జూలై 11: జోగిపేటలోని 16వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు అంగన్‌వాడీ నిర్వాహకురాలు సావిత్రి తెలిపారు. బుధవారం కేంద్రాన్ని మూసివేసిన తర్వాత రాత్రి సమయంలో కేంద్రం తాళాలు పగులగొట్టిన దుండగులు సిలిండర్, పాలు, మంచినూనె ప్యాకెట్లు, సీలింగ్ ఫ్యాన్, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేంద్రానికి వచ్చి వివరాలు సేకరించారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలో పాడైన కోడి గుడ్లు

రామచంద్రాపురం, జూలై 11: అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించిన ఉడకబెట్టిన కోడి గుడ్డు పాడైపోయి ఉండడంతో బాలుడి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లాపూర్ గ్రామానికి చెందిన సంతోష్ అతడి నాలుగేండ్ల కుమారుడు నిశాంత్‌ని రెండు రోజులుగా తెల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రానికి పంపిస్తున్నాడు. గురువారం సంతోష్ భార్య సరిత కుమారుడినికి ఇంటికి తీసుకువస్తున్న సమయంలో సిబ్బంది ఉడకబెట్టిన కోడిగుడ్డును ఇచ్చారు. ఇంటికి వచ్చిన తర్వాత బాలుడికి తినిపిద్దామని పొట్టు తీస్తున్న క్రమంలో పాడై, లోపల నల్లగా మారి కనిపించింది. ఆ గుడ్డుని వెంటనే ఫొటో తీసుకొని 'నమస్తే తెలంగాణ' దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి గుడ్లు పిల్లలకు ఇస్తే వారి ఆరోగ్యం పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

విధులు బహిష్కరించి నిరసన

సిద్దిపేట ఘటనపై న్యాయవాదుల ఆగ్రహం

కోహీర్, జూలై 11: సిద్దిపేట న్యాయవాది రవిపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ పట్టణంలోని సివిల్ కోర్టు న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారిని వెంటనే అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, జూలై 11: విధులు బహిష్కరించి న్యాయవాదులు నిరసన తెలిపారు. సిద్దిపేట జిల్లా న్యాయవాది రవికుమార్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ సంగారెడ్డి బార్ అసోసియేషన్ పిలుపుమేరకు బుధవారం నారాయణఖేడ్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సారెడ్డి మాట్లాడుతూ దాడి చేసిన పోలీసులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మారుతిరెడ్డి, బోజిరెడ్డి, నర్సింహారావు, లక్ష్మణ్‌రావు, సాయిలు, సుధాకర్, విష్ణు, రాజు పాల్గొన్నారు.



జహీరాబాద్ పట్టణంలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నారాయణఖేడ్‌లో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అభివృద్ధి పనులకు ఆమోదం

అమీన్‌పూర్, జూలై 11: పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన కమిషనర్ జ్యోతిరెడ్డి సమక్షంలో గురువారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. వైస్ చైర్మన్ నందారం నరసింహాగౌడ్, పాలక వర్గ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొని ఎజెండాలో పొందుపరిచిన అంశాలన్నింటినీ తీర్మానించి ఆమెదించారు. వివిధ అభివృద్ధి పనులకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.14.50 కోట్లను మౌలిక సదుపాయాల నిర్వహణ, రోడ్లు, పారిశుధ్య నిర్వహణ, వన మహోత్సవం, తదితర ప్రతిపాదనలతో పనులు చేపట్టుటకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. వారి వార్డుల్లో నెలకొని ఉన్న విద్యుత్ సమస్యలు, రోడ్లు, మురుగు నీటి కాల్వలు, వైకుంఠధామాలకు సంబంధించి వివరాలను సభ్యులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన చైర్మన్ వెంటనే ఆ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీని అభివృద్ధిపథంలో తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను వెంటవెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని సభ్యులను కోరారు. సమావేశంలో డీఈ వెంకటరమణ ఏఈ ప్రవీణ్, మున్సిపల్ ఆర్వో వెంకటరామయ్య, ఎలక్ట్రికల్ ఏఈలు మణికంట, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పాండురంగారెడ్డి

విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 11: జిల్లాలోని మైనార్టీ విద్యార్థులు విదేశాల్లో పీజీ, పీహెచ్‌డీ చదువుకునేందుకు ఆగస్టు 7లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి గురువారం ప్రకటనలో తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బుద్ధులు, జైనులు, పార్సీలు ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్ప్రింగ్ సీజన్-2024 సంవత్సరానికి గాను యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, సౌత్ కొరియాలో చదువుకునేందుకు అవకాశం ఉన్నదన్నారు. www.telanaganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత పత్రాలు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో వచ్చే నెల 7లోగా సమర్పించాలని సూచించారు. 2024 జనవరి 1నుంచి జూలై 31 మధ్య కాలంలో విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు అర్హులన్నారు. రూ.20 లక్షలు, టికెట్ ఫెయిర్ గరిష్టంగా రూ.60వేలకు మించకుండా అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షలకు మించరాదని స్పష్టం చేశారు. దరఖాస్తుకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా 9542867203 నంబర్‌పై సంప్రదించాలన్నారు.

పౌష్టికాహారం అందించాలి

కోహీర్, జూలై 11: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ జిల్లా అధికారి లలితాకుమారి ఆదేశించారు. గురువారం జహీరాబాద్ సమీపంలోని రంజోల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతల హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆమె వెంట సీడీపీవో సునీతాబాయి, పల్లవి, తదితరులు ఉన్నారు.

సంగారెడ్డిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మాదకద్రవ్యాలను అరికడదాం

ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, జూలై 11: మాదకద్రవ్యాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టిందని, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. గురువారం ఉదయం 4గంటల ప్రాంతంలో జిల్లాలో విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో యువత మత్తుకు బానిసలు కాకుండా పోలీసు యంత్రాంగం నాకాబంది నిర్వహించి వాహన తనిఖీలు చేపట్టిలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రధాన రహదారులపై వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి పండించినా, రవాణా చేసినా 87126 56777కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని స్పష్టం చేశారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

రామచంద్రాపురం, జూలై 11: నాటే ప్రతి మొక్కనూ సంరక్షిస్తే అవి చెట్లుగా మారి మేలు చేస్తాయని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. గురువారం ఉస్మాన్‌నగర్‌లోని కేజీబీవీ స్కూల్‌లో కమిషనర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో 75వ వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులతో కలిసి వంద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో విరివిగా మొక్కలు నాటుతామన్నారు.

కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటుతున్న కమిషనర్ సంగారెడ్డి

మొత్తం లక్ష మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యం అందించాలి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల నిరసన

సంగారెడ్డి, జూలై 11: ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు ప్రభుత్వం నగదు రహిత వైద్య చికిత్సలు అందించాలని, చాలా కాలంగా వాయిదా పడిన నాలుగు డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలని అ సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని పెన్షనర్లతో సమావేశమై నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పదవీ విరమణ సందర్భంలో కమ్యూటేషన్‌తో పొందిన మొత్తాన్ని 15 ఏండ్లలో రికవరీ చేస్తున్నారని, ఆ కాలాన్ని 12 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. పెన్షనర్లకు రావాల్సిన నాలుగు డీఆర్‌లు విడుదల చేసి ఏకమొత్తంలో బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బొంతపల్లిలో మెగా వైద్య శిబిరం

గుమ్మడిదల, జూలై 11: మండలంలోని బొంతపల్లి పారిశ్రామిక గ్రామంలో ఫ్లిప్‌కార్ట్ సంస్థ మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించింది. గురువారం బొంతపల్లిలో హెల్త్ క్యాంప్ నిర్వాహకులు డాక్టర్ కీర్తన, అక్షిల్యా ఆధ్వర్యంలో ఎంపీడీవో ఉమాదేవి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. బీపీ, షుగర్, థైరాయిడ్, దంత, చర్మవ్యాధులు, గర్భకోశ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సద్దిప్రవీణావిజయ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీ నివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, నాయకులు చక్రపాణి, సుంకరి శంకర్, వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీవో ఉమాదేవి

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

అందోల్: జోగిపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లాలో అవగాహన ర్యాలీలు తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరుగుదలతో కలిగే అనర్థాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 11

వైభవంగా బోనాల ఊరేగింపు

అనంతసాగర్‌లో బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్, జూలై 11: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని అనంతసాగర్‌లో దుర్గామాత బోనాల ఊరేగింపు గురువారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకం విఠల్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, రాములు, భూపాల్‌గౌడ్, లక్ష్మీకాంత్, సంగమేశ్వర్‌గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

ఇండ్ల పట్టాలివ్వాలి

సదాశివపేట, జూలై 11: అర్హులైన పేదలకు ఇండ్ల పట్టాలివ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద డిమాండ్ చేశారు. గురువారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ సిద్ధాపూర్ కాలనీలోని సర్వే నంబర్ 260లో ఆరేండ్లుగా పేదలు పూరిపాకలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. అర్హులైన పేదలకు పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు తాజొద్దీన్, షఫీ, రెహమాన్, ముంగి, రమేశ్, శంకరప్ప, దుర్గయ్య, మహబూబ్ అలీ, ఉమేశ్, పాండు, ముస్తఫా, అనసూజ, బుజ్జమ్మ, లక్ష్మి, తస్లీమ్, రాధ, జ్యోతి, శంకరమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రాయికోడ్, జూలై 10: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్మికులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. గురువారం రాయికోడ్‌లో మండల పత్యేక అధికారి జగదీశ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఎంఎం షరీఫ్‌లకు సీఐటీయూ నాయకుడు దశరథ్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

రామచంద్రాపురం, జూలై 11: నకిలీ ప్రెస్ కార్డులు చూపించి, రాజకీయ నాయకులమని బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిని ఉపేక్షించేది లేదని ఏసీపీ నర్సింహారావు గురువారం ప్రకటనలో హెచ్చరించారు. అలాంటి వారిని గుర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

లింకు రోడ్డు ధ్వంసాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

జిన్నారం, జూలై 11: మంగంపేట పరిధిలోని సర్వేనంబర్ 55లో స్థలం పొందిన పరిశ్రమ డంప్‌యార్డును ఆక్రమించి, వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూల్చివేయడాన్ని గ్రామస్తులు అడ్డుకోగా ఆర్డీవో, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరుగుతుండగానే యాజమాన్యం గురువారం మంగంపేట నుంచి ఊట్ల గ్రామానికి ఉన్న లింకు రోడ్డును ఇటాచీతో ధ్వంసం చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామస్తులను పంపించే ప్రయత్నం చేశారు. లింకు రోడ్డును ఇటీవల జడ్పీ నిధులతో పునరుద్ధరించామని, ధ్వంసం చేస్తే ఊరుకోమని మొండికేయడంతో లాఠీచార్జి చేయాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు. దీనికి గ్రామస్తులు పలువురు పెట్రోల్ పోసుకునేందుకు సిద్ధపడ్డారు. దీంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తవ్విన రోడ్డును గ్రామస్తులు పూడ్చివేయించారు. విషయం తెలుసుకున్న ఎంపీవో సంతోశ్‌కుమార్ కార్యదర్శి శ్రీలతతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వివరాలు ఉన్నతాధికారులకు చెబుతామని తెలిపారు.

వర్షాలు కురవాలని పూజలు

సదాశివపేట: శివలింగానికి రుద్రాభిషేకం చేస్తున్న దృశ్యం

కోహీర్: జహీరాబాద్‌లో శివలింగానికి అభిషేకం చేస్తున్న విద్యార్థులు

సదాశివపేట, జూలై 11: పట్టణంలోని సంగమేశ్వరాలయంలో వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పూజారి లీలావతి మోహన్‌రావు దంపతులు వర్షాలు కురవాలని హోమం నిర్వహించారు. అనంతరం శివలింగానికి రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నర్సింహారావు కులకర్ణి, ప్రధాన కార్యదర్శి నరేశ్‌దేశ్‌పాండే, సత్యనారాయణ కులకర్ణి, రాజేశ్వర రావు, రంగారావు, బీఎన్ శంకర్‌రావు, నారాయణరావు, ఆలయ కమిటీ సభ్యులు ఆకుల శివకుమార్, మారెపల్లి చిన్న శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివలింగానికి విద్యార్థుల జలాభిషేకం

కోహీర్, జూలై 11: వానకాలం ప్రారంభమై 40 రోజులు గడిచినా వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వరుణుడు కరుణించాలని, విస్తారంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని గురువారం జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు పాఠశాల విద్యార్థులు స్థానిక మార్కండేశ్వరాలయంలో శివలింగానికి జలాభిషేకం చేశారు. కలశాలతో ఊరేగింపుగా వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులా..

సిబ్బంది ముందే పాఠశాలలోకి ఆహార పదార్థాల పాత్రలను మోసుకెళ్తున్న విద్యార్థులు

బొల్లారం, జూలై 11: చిట్టి చేతులతో ఓ పాఠశాలలో వెట్టి చాకిరీ చేయిస్తున్న ఉదంతం మీది. వివరాల్లోకి వెళ్తే.. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రాథమిక పాఠశాలలో గురువారం అక్షయపాత్రకు చెందిన ఆహార పదార్థాలను విద్యార్థులతో మోయించారు. వేడివేడిగా ఉండే ఆహార పదార్థాలు ప్రమాదవశాత్తు విద్యార్థులపై పడితే ఎవరు బాధ్యులని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు బరువైన పాత్రలను పాఠశాలలోకి తరలిస్తున్నా కనీసం అటువైపుగా ఉపాధ్యాయులు, సిబ్బంది పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. విద్యార్థులతో పనులు చేయించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శివంపేట రైస్ మిల్లులో తనిఖీలు

చౌటకూర్, జూలై 11: మండలంలోని శివంపేట శివారులోని శ్రీసాయి వీరభద్ర రైస్ మిల్లులో గురువారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. సిద్దిపేట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ బృందం అధికారులు రైస్ మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం, బియ్యం బస్తాలను పరిశీలించారు. ఏ మేరకు నిల్వలున్నాయని అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేటలోని ధాన్యం నిల్వ గోదాములను తనిఖీ చేశారు. మూడు సీజన్లకు సంబంధించిన ధాన్యం నిల్వ ఉన్నదా లేదా అని యజమాని మహేందర్‌ను ప్రశ్నించారు. సెప్టెంబరు 30

వీరభద్ర రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కల్లా కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పూర్తి చేయాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ప్రభాకర్, చౌటకూర్ తహసీల్దార్ ఈశ్వరీరాణి, ఏఎస్ఐ వెంకటేశం, ఆర్ఐ యాదగిరి ఉన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కంది, జూలై 11: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సంగారెడ్డిలో రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఇస్తామన్న రెండు లక్షల రుణమాఫీని కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లెపల్లి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ప్రతి ఎకరానికి రూ.15 వేల ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రూ.12 వేలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ప్రధాన మంత్రి పంటల బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, శివకుమార్, చల్లా ప్రభాకర్‌రెడ్డి, మందుల నాగరాజు, కసిని వాసు, రాజుగౌడ్, ద్వారక రవి, పాపయ్య, సదానందం, ప్రవీణ్‌యాదవ్, సురేందర్, విజయ్‌కుమార్, రాములు, రైతులు పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం తీసిన టైర్ ఆట

ఝరాసంగం, జూలై 11: టైర్ ఆట ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి బాలుడు మృతి చెందిన ఘటన గురువారం ఝరాసంగం మండలం జిర్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బేగరి రవికుమారుడు విష్ణువర్ధన్(9) గ్రామంలోని

విష్ణువర్ధన్(ఫైల్)

ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. పాఠశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత మరో బాలుడితో కలిసి టైర్ ఆట ఆడుకుంటూ గ్రామానికి సమీపంలో ఉన్న వాగులో పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు.

సిద్ధి వినాయక ఆలయంలో పూజలు

న్యాల్‌కల్, జూలై 11: మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయాన్ని మండల రెవెన్యూ అధికారులు సందర్శించారు. గురువారం ఆలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, సిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు. అనం